# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

# ముఖ్యమంత్రి గారి కార్యాలయం

**పత్రికా ప్రకటన -3** **తేది: 15-11-14**

హైదరాబాద్ విషయంలో రాజీ పడితే తెలంగాణ రాష్ట్రం పదేళ్ల ముందే వచ్చేదని, కానీ తల తెగిపడ్డా హైదరాబాద్ విషయంలో రాజీపడేది లేదని తాము చెప్పబట్టే ఇవాళ హైదరాబాద్ తో కూడిన తెలంగాణ వచ్చిందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. హైదరాబాద్ ను, తెలంగాణను అద్భుతంగా తీర్చిదిద్దడానికి, దేశంలోనే నంబర్ వన్ గా తీర్చిదిద్దేందుకే తానింకా రాజకీయాల్లో కొనసాగుతున్నానని కేసీఆర్ ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇక్కడ ప్రజల అవసరాలకు, ఆలోచలనలకు తగ్గట్టు అభివృద్ధి జరగాలన్నది తన తపన అని, సీమాంధ్ర శక్తుల ఎత్తుగడలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాల్సిన అవసరాన్ని గుర్తించే తాను బాధ్యతలు స్వీకరించాల్సి వచ్చిందని ముఖ్యమంత్రి చెప్పారు. హైదరాబాద్ నగరానికి ఎంతో చరిత్ర, ఎన్నో ప్రాముఖ్యతలున్నాయని, అవి చెరిగి పోకుండా అభివృద్ధి చేయాలన్నదే తన తపన అని సిఎం చెప్పారు. అందుకోసమే మెట్రో రైలు ప్రాజెక్టులో కొన్ని మార్పులు సూచించినట్లు వెల్లడించారు.

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి శనివారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఎల్ అండ్ టి చైర్మన్ ఎ.ఎం. నాయక్, సిఎఫ్ఓ శంకర్ రామన్, హైదరాబాద్ మెట్రో ఎండి విబి గాడ్గిల్, చైర్మన్ ఎంవిఎస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, జిహెచ్ఎంసి కమీషనర్ సోమేష్ కుమార్, హెచ్ఎండిఏ చైర్మన్ ప్రదీప్ చంద్ర, సీనియర్ అధికారులు ఎస్.కె. జోషి, కలెక్టర్ మీనా, సిఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్ లో నిర్మిస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టు అత్యంత ప్రతిష్టాత్మకమైనదే కాకుండా, నగరానికి అత్యంత ఆవశ్యమకమైన ప్రాజెక్టు అని చెప్పారు. ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా ప్రాజెక్టు పనులకు సహకరిస్తున్న విషయాన్ని వెల్లడించారు. అయితే సజావుగా సాగుతున్న మెట్రో రైలు ప్రాజెక్టుపై అనుమానాలు వచ్చే విధంగా తెలంగాణలో ఉన్న ఆంధ్ర

మీడియా కథనాలు ప్రచురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ అండ్ టి కంపెనీ ప్రతినిధులు కూడా అనవసర గందరగోళానికి కారణమయ్యారని అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణలో అభివృద్ధి ఆగిపోవాలని, తెలంగాణ రాష్ట్రం ఆగం కావాలని ఆంధ్ర శక్తులు పనికట్టుకున్నాయని, ఆంధ్ర మీడియా కుట్రలకు వేదికగా నిలిచిందన్నారు. ఎల్ అండ్ టి రాసిన లేఖలను కూడా అందుకు ఉపయోగించుకున్నదని వెల్లడించారు. దీనికి ఎల్ అండ్ టి చైర్మన్ నాయక్ బదులిస్తూ, లేఖల విషయంలో సమాచార లోపం కారణంగా తప్పు జరిగిందని అంగీకరించారు. తమ ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తున్నదని, భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్టులు తెలంగాణలో చేపడతామని ప్రకటించారు.

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి భావేద్వేగంగా మాట్లాడారు. "ఆంధ్ర శక్తుల కుట్రలు మాకు తెలుసు. అసలు హైదరాబాద్ నగరాన్ని మాకు కాకుండా చేయాలనుకున్నారు. హైదరాబాద్ లేకుండా తెలంగాణ ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ఎన్నడో సిద్ధపడ్డది. కానీ మేము ఒప్పుకోలేదు. తల తెగిపడ్డా హైదరాబాద్ కావాల్సిందే అని పట్టుపట్టినం. వందలాది మంది యువకులు ఆత్మబలిదానం చేసుకున్నారు. నేను కూడా చావునోట్లో తలపెట్టాను. చివరికి హైదరాబాద్ తో కూడిన తెలంగాణ సాధించుకున్నం. తెలంగాణ వచ్చిన తర్వాత నేను క్రియాశీల రాజకీయాల నుంచి రిటైర్ కావాలనుకున్నా. కానీ, ఆంధ్ర శక్తులు ఈ రాష్ట్రాన్ని బతకనీయరని అర్థమైంది. నీళ్ల విషయంలో, ఉద్యోగుల విషయంలో, కరెంటు విషయంలో పేచీలు పెడతారని గ్రహించా. హైదరాబాద్ విషయంలో కూడా లేనిపోని రాద్ధాంతం చేస్తారని అనుకున్న. వారి కుట్రలను, ఎత్తుగడలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాల్సిన అవసరాన్ని గుర్తించాను. అందుకే తెలంగాణ సాధించడం ఒక్కటే కాదు, దాన్ని నిలబెట్టుకోవాలని నిర్ణయించుకున్న. క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్న నేను బాధ్యతలు తీసుకున్నది కూడా ఇందుకే. తెలంగాణ రాష్ట్రాన్ని ఓ విఫల రాష్ట్రంగా చేయాలని ఆంధ్ర శక్తులు ప్రయత్నిస్తున్నాయి. మేము అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే కుట్రలు ప్రారంభించారు. మెట్రో రైలు ప్రాజెక్టు ఆగిపోతున్నదని వార్తలు సృష్టించారు. ఎల్ అండ్ టి రాసిన లేఖలనే వారు వాడుకున్నారు. ఇది మమ్మల్ని ఎంతో బాధించింది. ప్రజలకు కూడా గందరగోళ పరిచింది. మెట్రో రైలు ప్రాజెక్టు కోసం మేం ఎంతో సహకరిస్తున్నాం. అయినా ఇలా లేఖలు రాయడం ఆంధ్ర మీడియా చేస్తున్న విష

ప్రచారానికి ఉపయోగపడింది. నిజానికి తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతే మెట్రో పనులు వేగంగా సాగుతున్నాయి. 72 కిలోమీటర్ల పొడవున్న మెట్రో రైలును 200 కిలోమీటర్ల వరకు పొడిగించాలని నేను చెప్పాను. అన్ని విధాల సహకరిస్తున్నాం. దీన్ని పట్టించుకోకుండా ఆంధ్రమీడియా మెట్రో రైలు ప్రాజెక్టు ఆగిపోతున్నదని, ఎల్ అండ్ టి కంపెనీ వెళ్లిపోతున్నదని ప్రచారం చేసింది" అని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

దీనికి ఎల్ అండ్ టి కంపెనీ చైర్మన్ నాయక్ బదులిస్తూ, తెలంగాణ రాష్ట్రంలో తమకు ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. తమ లేఖల వల్ల కలిగిన ఇబ్బందులు తలెత్తడం దురదృష్టకరమని, ఇందుకు భేషరతుగా క్షమాపణలు చెబుతున్నామన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేసీఆర్ చేస్తున్న కృషిలో తాము కూడా భాగస్వాములం కావాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో నిర్మించే థర్మల్ పవర్ స్టేషన్లు, రహదారుల నిర్మాణం తదితర పనుల్లో తమకూ భాగస్వామ్యం కావాలని అభ్యర్థించారు. హుస్సేన్ సాగర్ చుట్టూ టవర్లు నిర్మించే ప్రతిపాదనల పట్ల ఆయన ఆసక్తి కనపరిచారు. తాము కూడా టవర్లు కడతామని చెప్పారు. మెట్రో రైలు ప్రాజెక్టు మొదటి దశను త్వరిత గతిన పూర్తిచేసి, రెండో దశకు వెళతామని స్పష్టం చేశారు.

మెట్రో రైలు ప్రాజెక్టులో తమకు మొదటి నుంచీ మూడు అభ్యంతరాలున్నాయని, వాటి విషయంలో రాజీపడేది లేదని సిఎం చెప్పారు. మూడు చోట్ల అలైన్ మెంట్ మార్చాల్సిందేనని స్పష్టం చేశారు. దీనికి ఎల్ అండ్ టి కంపెనీ చైర్మన్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించే అలైన్మెంట్ ప్రకారమే ప్రాజెక్టు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. అసెంబ్లీ భవనం చాలా చరిత్ర ఉన్న భవనమని, దానిముందున్న అమరవీరుల స్థూపంతో తమకు భావోద్వేగ బంధం ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. అసెంబ్లీ ముందు నుంచి కాకుండా వెనక నుంచి లైను వేయాలని సూచించారు. సుల్తాన్ బజార్ కు కూడా ఎంతో చరిత్ర ఉందని, ప్రస్తుతమున్న అలైన్ మెంటు మార్చి కోఠి ఉమెన్స్ కాలేజీ వెనుక నుంచి లైన్ వేయాలని సూచించారు. పాతబస్తీలో వేసే లైను కూడా అక్కడి ప్రసిద్ధ ప్రార్థనా మందిరాల ముందు నుంచి కాకుండా, అక్కడి ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరినట్లు మార్చాలని చెప్పారు. ఈ మూడు ప్రతిపాదనలకు ఎల్ అండ్ టి కంపెనీ అంగీకరించింది. ఈ నెల 20న మరోసారి సమావేశమై అలైన్ మెంట్ మార్పుకు సంబంధించిన లే అవుట్ రూపొందించుకోవాలని రెండు పక్షాలు నిర్ణయించాయి. ఆ రోజు సమావేశానికి పాతబస్తీకి

సంబంధించిన ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని ముఖ్యమంత్రి చెప్పారు. కొన్ని కోర్టు కేసులు, మరికొన్ని అభ్యంతరాలు ఉండడంతో పూర్తిస్థాయి రైట్ ఆఫ్ వే ఇవ్వలేకపోయామని ముఖ్యమంత్రి చెప్పారు. కంట్రీక్లబ్, ఇస్కాన్, తమిళ చర్చి, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు అభ్యంతరాలు తెలిపాయని, వాటన్నింటినీ పరిష్కరించామని ముఖ్యమంత్రి చెప్పారు. కొన్ని కోర్టు కేసులు కూడా ఉన్నాయని, వాటిని కూడా త్వరలోనే పరిష్కరించుకోవడానికి అడ్వకేట్ జనరల్ కు సూచనలు ఇచ్చామని వెల్లడించారు. త్వరలోనే రైట్ ఆఫ్ వే ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మెట్రో రైలు ప్రాజెక్టు ఓ సమగ్ర ప్రాజెక్టుగా హైదరాబాద్ నగర ప్రజలకు సేవలందించాలన్నదే తన తపన అని చెప్పారు. అభివృద్ధి జరిగే నేపథ్యంలో చారిత్రక ఆనవాళ్లు చెరిగిపోవద్దని, మనోభావాలు దెబ్బతినవద్దనేది తన అభిమతమని ముఖ్యమంత్రి చెప్పారు. తాము సూచించినట్లు అలైన్ మెంటు మార్చడం వల్ల పెరిగే ప్రాజెక్టు వ్యయాన్ని భరించడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సిఎం ప్రకటించారు. హైదరాబాద్ నగరం ఇన్నాళ్లూ ఆంధ్ర పాలకులు గుప్పిట్లో ఉందని, వారిక్కడి భూమి పుత్రులు కాకపోవడం వల్ల, ఈ నగర స్వరూపాన్ని, స్వభావాన్ని అర్థం చేసుకోలేక పోయారని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్ ను ఓ రియల్ ఎస్టేట్ వ్యాపార కేంద్రంగా మార్చారని విమర్శించారు. కానీ తామిక్కడ పుట్టిన వారము కాబట్టే, తమకు మాతృభూమిపై ప్రేమ ఉంటుందని, అందుకు తగ్గట్టుగానే తమ ప్రతిపాదనలు, ప్రయత్నాలు ఉంటాయని సిఎం అన్నారు.

మెట్రో రైలు ప్రాజెక్టు పనులు మరింత వేగంగా జరిగేందుకు అవసరమైన భూ సేకరణలు, కోర్టు వివాదాల పరిష్కారాలు, ట్రాఫిక్ నియంత్రణలు తదితర విషయాలపై అధికారులు వేగంగా స్పందించాలని కోరారు.

---

**సిపిఆర్ఓ టు సిఎం**